# సుందరమ్మగారి సంధ్యారాగం

కథానిక

సుందరమ్మగారు తలుపుతీసి ఆప్యాయంగా ఆహ్వానించింది. అతడు లోపలికొచ్చి కూర్చున్నాడు.

"గంగా! రాజా వచ్చాడు. ఓవల్టైన్ తీసుకురా!" అంటూ ఓ పోలికేక పెట్టింది.

"అబ్బే! ఒద్దండీ! నా కలవాట్లేదు" అన్నాడు బిడియపడుతూన్న రాజారావ్.

"పుచ్చుకో బాబూ! మా యింట్లో కోకో, ఓవల్టైన్ తప్ప మరేదీ వాడం!" అంది.

సుందరమ్మగారు టేబుల్ఫాన్ తిప్పింది. రాజారావు చొక్కా బొత్తాలు విప్పాడు.

"రఘు లేడాండి?" అంటూ.

"లేడు బాబూ! రాత్రి కలకత్తా వెళ్ళాడు. మనకు సొమ్ము రావాలి. వీళ్ళ తాడు తెగా అప్పిచ్చిందాకా మనింటి చుట్టూ తిరుగుతారు, తీరా పుచ్చుకున్నాక వాళ్ళ చుట్టూ మనల్ని తిప్పుతారు" అంది.

"రెండేళ్ళయింది. కూతురు పెళ్ళి కాకుండా ఇంట్లో వుండిపోయింది. నువ్వు సాయం చెయ్యక పోతే వీల్లేదని కాళ్ళావేళ్ళా పడితే, ఆడపిల్లలు కన్నదాన్ని గుండె కరిగి అడ్డుపడ్డాను-తీరిందిగా వాడి అవసరమూ, అమర్దాను. ఇక అప్పటినుంచీ మాకు రైలు ఖర్చులు తప్పితే, చిల్లి గవ్వ కూడా తీర్చిన పాపానపోలేదు దొంగ ముండాకొడుకు!"

రాజారావు ముఖంలోకి ఓ మారు పరీక్షగా చూసి మళ్ళీ అంది "ఇలాంటివి ఒకటా, రెండా! దగ్గరదగ్గర పది పదిహేను రావాలి. అడిగితే కన్నీళ్లు కార్చేవాడేకాని, కానీ అయిన తీర్చిన పాపాన పోటంలేదు! నాకా—డబ్బు లేకపోతే క్షణం గడవదు! నీకు తెలియందేముంది?" అని.

"అయితే వీటన్నిటికీ పద్దూ పత్రమూ వుంచారా?" అన్నాడు రాజారావే.

"కొన్నలాగా కొన్నిలాగానూ—అ! పత్రం రాసినవాళ్లు మాత్రం ఇచ్చి చస్తున్నారా ఏం? కాకపోతే కోర్టుచుట్టూ తిరగడానికా-ని! అవసరానికడ్డుపడ్డానుకదా అన్న బుద్ధీ, విశ్వాసమూ వుండి పుచ్చుకున్నట్టే పువ్వుల్లో పెట్టి తీర్చాలిగాని! మొన్నటికి మొన్న ఓ మూడొందల బాకీని వదిలేశాను. పుచ్చుకున్నవాడు పుటిక్కున చచ్చాడు. మిగిలింది పుట్టెడుసంపద! పెళ్ళాంవచ్చి గొల్లుమంది, నా మనసు పిసికినట్లయింది సుమా! చెప్పొద్దూ! రాయించుకున్న నోటు ముక్క జేసిపొమ్మన్నాను."

"బావుంది: ఇలా అన్నీ తనకుమాలినధర్మాలు చేస్తే మిగిలేదేమిటి? మీ దాతృత్వాన్ని చెప్పుకునే వాళ్ళు కూడా వుండరు! డబ్బును మనమే సంపాదించినా, ఆ డబ్బు లేకపోతే మనముఖం చూసేవాడే వుండడు." అన్నాడు రాజారావు.

"పోనీ బాబూ! ఏదిశాశ్వతం? మాటశాశ్వతం గాని... చూడు గంగా! ఎవరో పిలుస్తున్నట్టుంది" అంది వీధివైపు చూస్తూ.

గంగ వెళ్ళి తిరిగొచ్చింది. "పోస్టుమేన్ అమ్మా! రిజిష్టరు ఉత్తరం ఉందిట" అంది.

సుందరమ్మగారు వెళ్ళి తీసుకుంది. తిరిగివస్తూ, "చూడు బాబూ! ఈవిషయం. తీసుకున్న సొమ్ము వెంటనే పంపమని రిజష్టరు ఉత్తరం పంపాను- ఓ ఆసామీకి. తీసుకోనన్నాడని తిరిగొచ్చింది... ఏం చెయ్యమంటావ్ చెప్పు?"

"దావా పడెయ్యండి."

"వల్లకాదు! తీసుకున్నదే ఇచ్చి చావకపోతే, దావాచేస్తేమటుకు వచ్చేదేముంది. కుండామండా వేలం తప్ప" పెద్ద నిట్టూర్పు విడిచింది. మళ్ళీ అంది "గంగా పెట్లోపారెయ్యమ్మా! ఈ ఉత్తరం."

గంగ ఉత్తరాన్నందుకుని, అడ్రసు మనసులోనే చదువుకుంటూ లోపలికెళ్ళిపోయింది.

"ఏమిటో బాబూ! అప్పిచ్చేటప్పుడు అంతా మంచివాళ్ళలాగే కనిపిస్తారు. తీర్చబోయేటప్పటికి కాని వాళ్ళ మంచీ చెడ్డా తేలడంలేదు..."

రాజారావు లేచాడు. "రఘు వుంటే చూచి పోదామని వచ్చాను. వస్తానండీ" అంటూ.

"రఘు లేకపోతే మాత్రం రాకూడదా యేం? అలాంటి అభ్యంతరాలేవీ పెట్టుకోకు బాబూ!"

టి. సభాపతిరావు

అంటూ రాజారావును సాగనంపి, తలుపేసేసి వచ్చింది సుందరమ్మగారు.

"గంగా! ఎక్కడనుంచే ఆ నోటీసు?"

"ఆ మర్వాడీ పంపాడు, వారం రోజుల్లో డబ్బు పంపకపోతే దావా చేస్తాట్ట" అంది గంగ.

ఆలోచిస్తూ ఉండిపోయింది సుందరమ్మగారు.

"అమ్మా! ఈ నోటీసు మనకొస్తే, రాజాతో అలా చెప్పావేం?" అంది గంగ అమాయకంగా.

"నువ్వు నోరు మూసుకో!" అని గసిరింది సుందరమ్మగారు.

సుందరమ్మగారి జీవిత సూత్రం తదితర్లకు అగమ్యగోచరం. పూర్వీకుల సంగతీ, వున్న ఆస్తిపాస్తుల సంగతీకూడా తెలియదు. పట్టణంలో కాపురము పెట్టి పదాదయింది. చుట్టుప్రక్కల వాళ్ళకి వీళ్ళ రాబడికంటే ఖర్చుసంగతే ఎక్కువ తెలుసు. తత్కారణంగా కూడా ఆవిడ కొంత గౌరవం సంపాదించుకుంది. ఇరుగుపొరుగువాళ్ళకు సలహాలివ్వడమూ; వాళ్ళపిల్లలు తుమ్మినా దగ్గినా చిన్న చిట్కాలు చెప్పడమూ - వల్ల ఆడాళ్ళందరికీ కావలసిందైంది కూడాను.

* * *

రాజారావు వచ్చివెళ్ళిన మరుసటిదినం సుందరమ్మగారూ, కూతురు గంగా, రాజారావింటికెళ్ళారు. రెండుపీశల లడ్డూలు, ఒకపీసె బాదుషాలు పట్టుకెళ్ళి రాజారావు భార్యచేతిలో పెట్టేటప్పటికి ఆవిడ తెల్లబోయింది!

"ఏమిటి పిన్నిగారూ! ఇదంతా?" అంటూ.

"అదేమిటమ్మా! అలా తెల్లబోతావే! మణులా మాణిక్యాలా? ఇవాళ మా గంగ పుట్టినరోజు. ఆప్తులందరికీ ఏదో కాస్తకాస్త. లోపలుంచు. పిల్లలుతింటారు" అంది.

భార్యలాగే అవస్థపడ్డ రాజారావు అందుకుని, "గంగపుట్టినరోజుకి మేం బహుమతులివ్వాలిగాని, మీరివ్వడమేమిటి? అదీకాక ఇన్నా? ఏ పది రూపాయలో ఖర్చుపెట్టి?" అన్నాడు.

"ఆ! పదిరూపాయలు!! మా రఘుపుట్టినరోజున వాడినాన్నగారు బ్రతికున్న రోజుల్లో, కలక్టర్లతోసహా మాయింటికొచ్చేవారు విందుకు. రోజులు మారినయ్‌రాజా! ఆనాడు అంతఘనంగా జేసి, ఈనాడు ఇలా సరిపుచ్చడం నాకెంతో బాధగా వుంటుంది. ఈ సంవత్సరం మా రఘు కూడాలేడు" అంటూ పెద్దనిట్టూర్పు విడిచింది.

"అయితే రఘు ఇంకా రాలేదాండి?"

"ఉత్తరం రాశాడు. ఆ ఆసామీ మరో నాలుగురోజులుంటే కనీసం వెయ్యయినా సద్దుతానన్నాట్ట" అంది.

"ఇస్తానంటే మరో నాలుగురోజులున్నా ఇబ్బందిలేదు. వుండి అదేదో చూసుకునే రమ్మనకపోయారూ?"

"ఆ! అలాగే టెలిగ్రామిచ్చాను." అంది సుందరమ్మగారు.

తర్వాత కాస్సేపు పిచ్చాపాటీ మాట్లాడి, రాజారావునీ, అతని భార్యనీ, వాళ్ళపిల్లల్నీ వర్ణించి, వర్ణించి; వాళ్లు భోంచెయ్యమన్నా వుండక తిరిగివచ్చేసింది సుందరమ్మగారు గంగతో.

ఇంటికొచ్చాక గంగ అడిగింది. "ఏమిటమ్మా ఇదంతా? నా పుట్టినరోజు మొన్నేగా వెళ్ళింది. ఆవేళ కొత్తబట్టలమాట ఎత్తితే డబ్బులేదన్నావ్. ఇవాళ పదిరూపాయలు అనవసరంగా ఖర్చు చేసావ్!" అని.

"నువ్వునోర్మూయ్! అనవసరవిషయాల్లో కలుగజేసుకుంటే గుడ్లూడదీస్తాను. తెలుసా?" అని దబాయించేసరికి గంగ నాలిక్కరుచుకుని తుర్రుమంది లోపలికి.

రాజారావు మొదట్లో బీదవాడైనా, యుద్ధం రోజుల్లో మామగారిఅండ జేరి కంట్రాక్టులు చేసి కావలసినంత సంపాదించి, ఇప్పుడు సొంతంగా వ్యాపారం చేసుకుని బ్రతుకుతున్నాడు. తను కాపురంవున్న మేడ, పదెకరాల మాగాణి, ఇరవై వేల పెట్టుబడితో బట్టలవ్యాపారమూ. ఇదీ అతని విలువ.

సుందరమ్మగారి కొడుకు రఘురామయ్యా, రాజారావూ అనుకోకుండా ఓసారి రైలుప్రయాణంలో కలుసుకోవడమూ, యథాలాపంగా పలుకరించుకోవడమూ, తర్వాత ప్రాణస్నేహితులవడమూ సంభవించింది. అప్పటినుంచీ వాళ్ళింటికి వీరూ,వీళ్ళింటికి వారూ, రావడాలూపోవడాలూ కూడా వుంటూవచ్చినయ్.

* * *

ఆరోజు కొట్టుదగ్గరకూర్చుని మంచి రద్దీలో

వున్న రాజారావు, వస్తూన్న సుందరమ్మగారిని చూసి సగౌరవంగా లేచివచ్చి ఆహ్వానించాడు. సుందరమ్మగారు ఎండలో వచ్చినందువల్లకాబోలు "ఉస్సు"రంటూ కూలబడింది.

"ఏమిటి? ఇంత ఎండలోవచ్చారు. బట్టలేమన్నా కావాలా?" అంటూ ఆదరించాడు రాజారావు.

"సరి! వున్నవే తొడగలేక పెట్టెల్లో మూలుగుతూవుంటే!" అంటూ ఒక్కసారి కొట్టంతా కలయచూసింది.

" ... ... ... ... "

"ఏమిటో రాజా! చేతులోవున్నది జారవిడుచుకుని, అవసరాలకి ఇబ్బందిపడాల్సి ఒస్తున్నది. వెళ్ళిన రఘు ఇంకారాలేదు ..." అంటూ తటపటాయించింది.

రాజారావు గ్రహించాడు ఆవిడ అవసరం.

"ఏమాత్రం?" అన్నాడు.

"ఆ! ఆరువందలు! తొందరగా రైతుకు పంపాలి. ప్రతిసంవత్సరం గట్టుకట్టాలి, పుట్టకట్టాలి అంటంతప్ప మరేంలేదు. భూములున్నాయన్నమాటేగాని— చచ్చిపోతున్నా వీళ్ళతో. నిరుటిదాకా పొగాకువేసి బంగారంలాంటి భూముల్ని కాస్తా పనికిరాకండాచేశారు. అది కాస్తా రంగురాలేదనీ, వల్లకాడనీ కాళ్ళుతేలేశారు" అంది ఎంతో విసుగ్గా.

రాజారావు, సుందరమ్మగారు అంత పెద్ద మొత్తం అడుగుతుందనుకోలేదు. ఒకటిరెండుసార్లు వందలోపే పట్టుకెళ్ళి, పెట్టిన గడువు ముందుగానే తిరిగిపంపింది. అదీగాక రాజారావు దగ్గర ఆ క్షణంలో అంతమొత్తం లేదుకూడాను.

"నాయనా! రఘు రాగానే అంచాలమీద పంపేస్తా కష్టపెడుతున్నాననిమాత్రం అనుకోకు" అంది మళ్ళీ రాజారావు ముఖంలోకి చూస్తూ.

రాజారావు ప్రక్కకొట్లోకి గుమాస్తాను పంపి, డబ్బుతెప్పించి ఇచ్చాడు.

"లెక్కపెట్టండి" అంటూ—

"అబ్బే! ఎంతమాట! నీమీద నాకు అనుమానమా?" అంటూ లేచింది. బయటవున్న బండిలో ఎక్కబోతూవుంటే సుందరమ్మగారిని పలుకరించాడు. ఓబక్క పలుచటి వ్యక్తి.

"ఎవరూ సుందరమ్మగారా!" అంటూ.

సుందరమ్మ ఆయన్ను పరీక్షగా చూసింది.

"నే నేనండీ! రత్నాన్ని ఇప్పుడు మీ రిక్కడుంటున్నారా?" అన్నారు నవ్వుతూ.

"... వెంకటరత్నవా! ఆ! ఆ! ఇక్కడే వుంటున్నా ... పోనీవోయ్ బండీ" అంటూ బండిలోఎక్కి కూచుంది.

సుందరమ్మను పలుకరించిన వెంకటరత్నమూ, ఆవిడకు డబ్బిప్పిచ్చిన రాజారావూ వర్తకరీత్యా పరిచితులు. వెంకటరత్నమూ, సుందరమ్మగారూ పలకరించుకోవడం చూసిన రాజారావు, వెంకటరత్నాన్ని అడిగాడు.

"మీకు తెలుసా ఏమిటి ఆవిడ?" అని.

"ఆ! ఆ! క్షుణ్ణంగాను. మీకొట్లో కాతావా?"

"అబ్బే!"

"మరి డబ్బా?"

నవ్వుతూ తలూపాడు రాజారావు.

"కాని మంచి తెలివైంది. ఎన్ని ఢక్కామొక్కీలు తిన్న మగాడైనా దానిదగ్గర కానీకూడా పనికిరాడు" అన్నాడు వెంకటరత్నం.

వెంకటరత్నం సుందరమ్మగారిని అగౌరవంగా మాట్లాడ్డంవల్ల ముఖం దింపేసుకున్నాడు రాజారావు. అలా మాట్లాడ్డం అతనికెంతో చిన్నతనమనిపించింది.

"ఏమాత్రం రాజారావుగారూ?" అన్నాడు మళ్ళీ.

"ఏదో చేబదులు" ముఖం పైకెత్తకుండానే సమాధానం చెప్పాడు. మనసులో విసుక్కున్నాడు 'ఈ ఆరాలన్నీ ఎందుకువీడికి' అని.

వెంకటరత్నం వచ్చినపని చూసుకుని వెళ్తూ హెచ్చరించి మరీ వెళ్ళాడు. "కొంచం జాగ్రత్తగా వుండండి. అదో తాడూ బొంగరంలేని తాయారమ్మ. వస్తా!" అని.

వెళ్తూన్న వెంకటరత్నాన్ని చూసి అసహ్యించుకున్నాడు రాజారావు. "చెడి బ్రతికినవెధవ! నీచబ్బుద్ధిపోతుందా?" అనుకున్నాడు మనసులో

ఇంటికొచ్చి కూతురుతో అంది సుందరమ్మగారు "పాపిష్టి ముండాకొడుకు! ఆ వెంకటరత్నంగాడు ఎదురయ్యాడు. ఆ రాజారావుతో ఏం కూస్తాడో ఏమో?" అని.

"అవునమ్మా! అందరిదగ్గరా ఇలా అప్పులుచేసి తీర్చకపోతే అనరూ? ఎన్నాళ్ళనీ ఇలా?" అంది గంగ.

"నోర్ముయ్! పళ్ళూడేను. వెళ్ళు లోపలికి!" అంటూ గుడ్లురుమి చూసింది సుందరమ్మగారు.

ఇది జరిగిన వారానికి రఘు వచ్చాడని తెలిసి వాళ్ళింటికెళ్ళాడు రాజారావు. లోపలేదో పని లోవున్న సుందరమ్మగారు ఆదరాబాదరా వచ్చి అంది.

"విన్నావా రాజా! ఆ మాయ ముండా కొడుకు సంగతి. వారంరోజులూ వుంచుకుని, కాళ్ళుచేతులూ పట్టుకు బ్రతిమాలాట్ట వచ్చే నెల్లో రమ్మని!"

రాజారావు తెల్లబోయాడు!

"వాడిమాట నమ్మి నీకు మాటిచ్చాను. పెద్ద మనిషివి! మాట దబరా అయింది. ఇలా అయితే పరపతు లుంటాయా?" అని మళ్ళీ అంది.

రాజారావు మరీ తెల్లబోయాడు! ఏడ్చేది తనైనా, అందుకు ప్రయత్నిస్తూన్నట్లు కనిపించే వాళ్ళను ఓదార్చాలిగా!

"ఆ! ఇప్పుడేమైంది. వున్నప్పుడే ఇద్దురుగాని" అంటూ ఓదార్చేడు.

సుందరమ్మగారు ఓ పొలికేక పెట్టింది "గంగా! రాజా వచ్చాడు. కోకో తీసుకురా!" అంటూ.

"అబ్బెబ్బె! వద్దండి. కోకో నాకలవాట్లేదు. వస్తా" అంటూ లేచి దబదబా మెట్లుదిగి రోడ్డు యెక్కాడు రాజారావు.

* * *

నెలలు గడిచినయ్. రాజారావు రఘుకోసం వెళ్తూనేవున్నాడు. సుందరమ్మగారు తీర్చని బాకీ దారుల్నీ, పండని భూముల్నీ దుమ్మెత్తిపోస్తూనే వుంది. రాజారావుచేత బలవంతాన కోకోవో, ఓవల్ టైనో తాగిస్తూనే వుంది.

రాజారావు భార్యకూడా అంది ఓసారి. "సుందరం పిన్నిగారు అసలు రావడమే మానేసింది. ఎందుకనో?"

"ఎందుకు లెద్దూ. వచ్చిందగ్గరనుండే అవీ ఇవీ తెస్తుంది. మళ్ళీ మనం తీర్చాలా ఏమన్నానా?" అన్నాడు రాజారావు భార్యకు ముఖం చాటు చేసుకుని పాపం!

కాని రాజారావు భార్యకు అందులోని అంతరార్థం తెలిస్తేగా!

---

స్కెచ్

# లవంగాల పిల్ల

"రమణశ్రీ"

మమతలూ, అభిమానాలకూ హేతువులని ప్రశ్నించే అంతస్సుకి జవాబుగా ఎవరో ఒక వ్యక్తి నిలబడుతుంటారు! ఆ వ్యక్తిలో శక్తి మన లను ఆకర్షించేటంత ఉత్సాహంగా వుంటుంది. ఏమో! ఆ అమ్మాయి నెవరెరుగుదురు? చూచిన తొలిచూపులోనే, నేత్రనాళంలో రక్తాన్ని ఉద్రేకపరచింది! ఆ ఆకర్షించే జీవం, భగవద్దత్తమైన ప్రత్యేక సమాకర్షణలో—నత్తుల్లేని చెవులూ, నిరలంకారమైన నాసిక, అమాయికపు నవ్వు—నిశ్చలమైన చూపులో నిద్ర— హృదయాన్ని పులకరింపజేస్తాయని ఎవరూహించారు?

ఆ అమ్మాయి చిన్ని చెవి రంధ్రాల్లోంచి, లవంగాలు తీసేస్తూ, "ఎవరునువ్వు? ఎందుకు నవ్వు?— చెవుల్లో లవంగాలు పెట్టావే?— దుద్దుల్లేవూ?" అన్నాను.

చేతులూపింది లేవనేసైగగా. పైగా నవ్వుతూ పెదవుల్ని ధనువుల్లా వంచి, నిర్లక్ష్యంగా నవ్వింది. ఆ నవ్వు నాకు జవాబుకాదు సరిగదా! అధిక్షేపణగా ఎదురొచ్చింది, మళ్ళీ చెవి రంధ్రాల్లో లవంగాలు దూరుస్తూ, "ఇంకా అజ్ఞానంలో కొట్టుకొంటోన్న కళ్ళువిప్పని, అజ్ఞాత సౌందర్యం కాబోలు!" అన్నాను. ఆ మాటలు మళ్ళీకొత్తగా వినిపించి, పకపక నవ్వింది.

సంధ్య. సువాసనకి అలసిన చల్లనిగాలి. వీటి మధ్యలో ఏకాంతంగా వున్నాను. అటూ ఇటూ ఇంట్లోజనం హడావిడిగా మసులుతూనేవున్నారు.